www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 జూన్ 2024
5
చిత్తూరు



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన


ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనలో భాగంగా రూట్ మ్యాప్‌లను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ షన్మోహన్ ఆదేశాలు జారీ చేశారు. తొలుత పిఈఎస్ మెడికల్ కాలేజీలో హెలిప్యాడ్, ఆడిటోరియంలో సమావేశ నిర్వహణ, బ్యారికేడింగ్, కుప్పం బస్టాండ్ కూడలి వద్ద దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించుట, అక్కడ పుష్పాలంకరణ ఏర్పాట్లు, ఆర్అండ్‌బి అతిథి గృహంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను, అతిథి గృహం వద్ద బ్యారికేడింగ్, తదితర అంశాలపై సంబంధింత అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా పర్యటించే ప్రతి ప్రదేశం వద్ద ఇన్‌ఛార్జ్ అధికారులను నియమించాలని ఆదేశించారు. కుప్పం ఆర్అండ్‌బి అతిథి గృహంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జెసి శ్రీనివాసులు, ఆర్అండ్‌బి ఎస్ఈ ఉమా మహేశ్వర్ రెడ్డి, పలమనేరు ఆర్డీవో మనోజ్ రెడ్డి, డీఎస్పీ శ్రీనాథ్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, తహసిల్దార్ హరికుమార్, నాయకులు మునిరత్నం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మనోబలం, ఆత్మస్థైర్యం

- స్వామి శుద్ధానంద జి
- పరమహంస యోగానంద విద్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం, విద్యాలయ కౌన్సిల్ ఎన్నిక వేడుకలు


శాంతిపురం: కార్యక్రమంలో మాట్లాడుతున్న శుద్ధానంద జి

ప్రజాశక్తి-శాంతిపురం: యోగాతో మంచి ఆరోగ్యం, మనోబలం, ఆత్మస్థైర్యం లభిస్తుందని స్వామి శుద్ధానంద జి అన్నారు. శుక్రవారం మండలంలోని పరమహంస యోగానంద విద్యాలయంలో వైభవంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం, విద్యాలయ కౌన్సిల్ ఎన్నిక వేడుకలు నిర్వహించారు. ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభమై, యోగాసనాలు, ర్యాలీతో ముగించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన స్వామి శుద్ధానంద జి, బ్రహ్మచారి స్వామి నిరంజనానంద్ జిలి, విద్యాలయ చైర్మన్ గోపాల్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అంతర్జాతీయ యోగా దినోత్సవం గొప్పతనాన్ని, మన నిత్య జీవితంలో యోగాసనాలకు గల ప్రాముఖ్యతలి గురించి విద్యార్థులకు వివరించారు. యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకుని మంచి ఆరోగ్యాన్ని, మనోబలాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు కార్యక్రమంలో విద్యాలయ కమిటీ మెంబర్ చక్రపాణి రెడ్డి, నారాయణ శెట్టి, చంద్రశేఖర్, గణపతి శాస్త్రి, కోదండప్ప పాల్గొన్నారు. ఆ తర్వాత విద్యాలయ కౌన్సిల్ ఎన్నిక ద్వారా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జెస్ ఇచ్చారు. వారి యొక్క బాధ్యతలను వారికి తెలియజేశారు. విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ పాల్గొని విద్యాలయ కౌన్సిల్లో సభ్యులుగా ఎన్నికైన విద్యార్థులకు వారి బాధ్యతలను చక్కగా నిర్వహించాలని సూచించారు. యోగ ద్వారా అందుతుందన్నారు. యోగ గురువుల ఆధ్వర్యంలో ఆసనాలను నేర్చుకొని అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు, డిఆర్‌వో బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, డిఎఫ్‌వో చైతన్యకుమార్ రెడ్డి, ఏఎస్పీ అడ్మిన్ ఆరిపుల్లా, పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డిఆర్‌డిఏపిడి తులసి, డిపివో లక్ష్మి, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, జిల్లా స్పోర్ట్స్ అధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: జేసీ


చిత్తూరు అర్బన్: యోగాసనాలు చేస్తున్న జేసీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం చిత్తూరు పివికెఎన్ గ్రౌండ్స్‌లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం నెహ్రూ యువ కేంద్రం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలనన్నారు. ప్రపంచ దేశాలకు యోగా శాస్త్రంను అందించిన ఘనత భారతదేశంకు దక్కిందన్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి చక్కటి పరిష్కారం

యోగా మనసును ప్రశాంతం చేస్తుంది

- ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సూర్య ప్రతాప్ కళ్యాణ మండపంలో ఎస్పీ ఆధ్వర్యంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ నాగేశ్వర రావు పర్యవేక్షణలో ఆర్మ్డ్ రిజర్వు పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ అధికారులు, సిబ్బందితో కలిసి యోగాసనాలు చేశారు.

రామకుప్పం: యోగాసనాలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని తహసిల్దార్ శ్రీధర్, ఎంపీడీవో ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలు నిర్వహించి విద్యతోపాటు ఇతర క్రీడలు పట్ల ఆసక్తి చూపి మరింత ఆరోగ్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: అపోలో యూనివర్సిటిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రఖ్యాత యోగా శిక్షకులు ఈ కార్యక్రమాన్ని నడిపించారు. కార్యక్రమంలో వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యానం చేయించారు. యోగా ప్రాధాన్యతను, దాని ఆరోగ్యకర ప్రయోజనాలను అందరికీ వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా యోగా పద్ధతులను నేర్చుకున్నారు. ఎన్‌సీసీ యూనిట్ సభ్యులు కృషి చేశారు.

పలమనేరు: పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ కోర్టులో సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ లిఖిత నేతృత్వంలో యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జ్ లిఖిత మాట్లాడుతూ.. నిత్యం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు యోగాను చేయడం అలవాటు చేసుకోవాలన్నారు.

చిత్తూరుడెస్క్: యోగా వ్యాధినిరోధక శక్తిని పెంచుతుందని నగరి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని అధ్యాపకులకు, విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బ్రహ్మానందం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలో అంతర్లీనమై ఉన్న యోగాన్ని విద్యతో అనుసంధానం చేయాలని డీఎం పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లోను, ఎన్ ఆర్జీఎస్ సిబ్బంది కూడా ఆసనాలు వేసి ఘనంగా జరుపుకున్నారు.

బైరెడ్డిపల్లి: ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేజీబీవీ స్కూల్ కమ్మనపల్లిలో ఏపీసి వెంకటరమణ రెడ్డి, జిసిడిఓ ఇంద్రాణి, ఎస్‌వో స్వరూపలు పాఠశాలలో ఘనంగా యోగా డే జరుపుకున్నారు. తిరుపతి నుంచి యోగా మాస్టర్ కే.దేవరాజుల నాయుడు విద్యార్థులకు యోగపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు విజయచంద్ర, శాలిని ఆధ్వర్యంలో జరిగింది.

సదుం: సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఘనంగా ప్రపంచ యోగ దినోత్సవాన్ని నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం జయకుమార్ రెడ్డి తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి, యోగ మాస్టర్ రమేష్ విద్యార్థులకు ఆసనాలు వేయించారు.

సోమల: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

చిత్తూరుఅర్బన్: నిత్యం యోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధిద్దాం అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. శ్రీహర్ష మాట్లాడుతూ నిత్య యోగ సాధన ద్వారా మనం ఆరోగ్యాన్ని సాధించవచ్చని, విద్యార్థులు తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకున్నప్పుడు ఏకాగ్రత పెరిగి విద్యను సులభంగా పొందవచ్చని, ప్రతి ఒక్కరూ యోగ ఆసనాలు చేయాలని కోరారు. ప్రిన్సిపల్ శరత్ చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతదేశం తపోభూమి, ధర్మ భూమి, యోగ భూమి అని కావున యోగ ద్వారా ప్రపంచానికి ఒక శక్తిని, వెలుగును ఆరోగ్యాన్ని ఇవ్వడానికి భారతదేశం యోగా ద్వారా ప్రయత్నిస్తుందని కావున విద్యార్థులు తమ గ్రామాల్లో కూడా యోగాను అందరికీ నేర్పించేలా చేయాలని కోరారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన గోపాల్ విద్యార్థుల చేత వక్షా వక్షాసన్ సూర్య నమస్కారాలు ధ్యానం చేయించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డప్ప, ఓబులేషు, జ్యోతిర్మయి ప్రసన్న ఎంఎస్ఎస్ వాలంటీర్లు అమర్ పాల్గొన్నారు.

పిఎంజె జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభించిన మేయర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పిఎంజే జ్యువెలరీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఎగ్జిబిషన్ ను తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష శుక్రవారం ప్రారంభించారు. స్థానిక లక్ష్మీపురం సర్కిల్ వద్దనున్న పి.ఎల్.ఆర్ కన్వెన్షన్ హాల్ వద్ద జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.ఎం.జే క్లస్టర్ మేనేజర్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో మూడు రోజుల పాటు పీ.ఎం.జే జ్యువెలర్స్ ప్రదర్శన, అమ్మకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ హీరో మహేష్ బాబు కుమార్తె సితార అంబాసిడర్ గా ఉన్న సితార కలెక్షన్ను ఇక్కడ అందుబాటులో ఉంచామని తెలిపారు. సరి కొత్త డిజైన్లతో మహిళలకు ఆకర్షించే ఆభరణాలను ప్రదర్శనలో విక్రయానికి ఏర్పాటు చేశామని అన్నారు. ఎగ్జిబిషన్స్ సందర్భంగా ప్రత్యేకంగా ప్రతి కొనుగోలు పై స్కీమును వినియోగదారులకు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. మూడు రోజులులో 8 సంవత్సరాల నుంచి 80 సంవత్సరల వయసు కలిగిన అందరికి అందుబాటులో మన పీఎంజె జువెలరీస్ వారు తిరుపతి పరిసర ప్రాంతాలు వారికి అందుబాటులో ఉంటాయి. ఈ కార్యక్రమంలో తిరుపతి మేనేజర్స్ చంద్ర, సోమశేఖర్ రెడ్డి, రషీద్ పాల్గొన్నారు.



'సహకార సంఘాలకు పర్సనల్ ఇన్‌ఛార్జ్‌లను నియమించాలి'



ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జిలను నియమించాలని జిల్లా పీఏసీఎస్ యూనియన్ నాయకులు గౌరవ అద్యక్షులు తులసి పిళ్ళై, జిల్లా అద్యక్షులు విజయకుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వారు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 37సంఘాలకు గాను 11సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జిలు ఉన్నారని మిగిలిన 26సంఘాలకు లేరన్నారు. ఈ కారణంగా వ్యాపార లావాదేవీలు స్తంభించాయన్నారు. ముఖ్యంగా పెట్రోల్ బంకు నిర్వహణ, బంగారు ఋణములు ఇచ్చుట, ఎరువులు కంపెనీ వారికి డీడీలు చెల్లించుటకు సంఘాలు ఇబ్బంధులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఉన్నతాధికారులు ఈ అంశంపై స్పందించి త్వరతగతిన 26సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జిలను నియమించి రైతుల సమస్యలను పరిస్కరిం చాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, రాష్ట్రనాయకులు సుబ్రమణ్యం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్రనాయుడు, జిల్లా సహకార్యదర్శి రామమూర్తి, పీఏసీఎస్ సిబ్బంది శేఖర్, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పనితీరు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

ఓట్లు లెక్కింపు సందర్భంగా తిరుపతి జిల్లా పోలీసులు పనితీరు స్ఫూర్తిదాయకమని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. తిరుపతి నగరంలోని శిల్పారామం కన్వెన్షన్ హాల్ లో తిరుపతి, తిరుమల సబ్ డివిజన్ల, ట్రాఫిక్, సిసిఎస్, మహిళా పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సార్వతిక ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైన ఉదయం నుంచి రాత్రి వరకు కదలకుండా పోలీసులు ఉద్యోగం చేశారని, అధికారులు, సిబ్బందిని పేరుపేరునా జిల్లా ఎస్పీ అభినందించారు. రానున్న రోజుల్లో కూడా ఉద్యోగం బాగా చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఇదే నిబద్ధత ఉండాలని, మీరు చేసే ఉద్యోగం ద్వారా సమాజానికి మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ అదనపు ఎస్పీలతో కలిసి పోలీస్ సిబ్బందికి స్వయంగా భోజనాన్ని వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, విమల కుమారి, డీఎస్పీలు వెంకటాద్రి, రవి మనోహరాచారి, రవికుమార్, రమణ కుమార్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



అంకిత భావంతో సేవలందించారు

శ్రీకాళహస్తిలో... ఎన్నికల విధుల్లో శ్రీకాళహస్తి సబ్ డివిజన్ శాఖా పోలీసులు అంకిత భావంతో పనిచేశారనీ, ఎక్కడ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సర్వశక్తులు ఒడ్డారని జిల్లా అదనపు ఎస్పీ కులశేఖర్ కొనియాడారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులను అభినందిస్తూ శుక్రవారం ఆర్జివి కళ్యాణమండపంలో శ్రీకాళహస్తి , రేణిగుంట సబ్-డివిజన్ల పోలీసు అధికారులు, సిబ్బందితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ సార్వతిక ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైన ఉదయం నుంచి రాత్రి వరకు కదలకుండా పోలీసులు ఉద్యోగం చేశారనీ, ఫలితాలు వచ్చిన మరో పది రోజులు కూడా గ్రామాల్లో శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లకుండా గస్తీ కాశారంటు అభినందించారు. శ్రీకాళహస్తి డిఎస్పి బి.ఉమా మహేశ్వర రెడ్డి, రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడం దారుణం

ప్రజాశక్తి - రేణిగుంట: ప్లాట్ల అమ్మకం పేరుతో పేదల నుంచి లక్షలు వసూలు చేసిన వైసిపి నాయకులు, దళారులపై కేసు నమోదు చేయాలని ఇళ్లస్థలాల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. వివేకానంద కాలనీ పేదల ఇళ్లు కూల్చడం దారుణమని నినదించింది. ఇంటి స్థలాల బాధితుల డబ్బు రికవరీ చేసేలా టిడిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి కె.హరినాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వివేకానంద కాలనీ ఇంటి స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు సెల్వరాజు పాల్గొన్నారు. రేణిగుంట డిప్యూటీ తహశీల్దార్ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. తహశీల్దార్ కార్యాలయం పక్కన సిబిఐడి కాలనీ, చెంగారెడ్డిపల్లి, తారకరామనగర్, సిఆర్ఎస్ క్వార్టర్స్ వెనుక చెరువు ఆక్రమణ ఎర్రమరెడ్డిపాలెం చెరువు, కరకంబాడి ఎర్రగుట్ట ఆక్రమణ మొదలైన చోట్ల వైసిపి నాయకులు ఎంఎల్ఏ సహకారంతో రెవెన్యూ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని పేదల దగ్గర లక్షలు వసూలు చేశారన్నారు. 2017-18లో అప్పటి రిటైర్డ్ ఎంఆర్ఓ నరసింహులునాయుడు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల అమ్మకాలు జరిపి కోట్లు గడించిన వారిపై, ఇంటిపట్టాలు, పన్నులు ఇచ్చిన అధికారులపై విచారణ జరిపేలా శ్రీకాళహస్తి ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, అమిదా, మల్లేశ్వరి, కరుణాకర్, హేమలత పాల్గొన్నారు.

'రోగి సంరక్షణకు కృత్రిమ మేధ రోబోటిక్స్'


సమావేశంలో మాట్లాడుతున్న మణిపాల్ ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానం, కత్రిమ మేధస్సు బాగా పెరగడంతో, సాంప్రదాయ శస్త్రచికిత్సల కంటే 94శాతం నుంచి వంద శాతం విజయవంతమైన రేటుతో, తక్కువ చిక్కు సమస్యలతో ఇండియాలో శస్త్రచికిత్సలు నిర్వహించబడుతున్న పద్ధతి విప్లవాత్మకం అయింది. ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ పాత్రను వెలుగులోనికి తేవడానికై, బెంగళూరు ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్ యందలి మణిపాల్ హాస్పిటల్ శుక్రవారం పరస్పర సంభాషణతో కూడిన మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఔషధరంగంలో కత్రిమ మేధస్సు, రోబోటిక్స్ ముమ్ముందుకు ఎలా దారి చూపగలవో అనే అంశంపై ముగ్గురు ప్రముఖ నిపుణులు డాక్టర్ ఎస్.విద్యాధర, చైర్మన్, హెచ్ఓడి వెన్నెముక శస్త్ర చికిత్స కన్సల్టెంట్ రోబోటిక్ స్పైన్ సర్జరీ, డాక్టర్ లోకేష్ ఎ.వీరప్ప, కన్సల్టెంట్-ఆర్థోపెడిక్, రోబోటిక్ కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్స, డా. హేమంత్ కుమార్, కన్సల్టెంట్ - జిఐ, హెచ్‌పిబి, రోబోటిక్ సర్జరీ గారలు తమ విలువైన సలహా సూచనలను చేశారు. దాదాపుగా సున్నా-మార్జిన్ దోషం ఉండేలా చూసుకుంటూ డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తారన్నారు. డాక్టర్ ఎస్.విద్యాధర "రోబోటిక్స్ వాడకం ద్వారా, మేము స్కోలియోసిస్ దిద్దుబాట్లు, వెన్నుపూస సంబంధిత ప్లాస్టీలు, కైఫోప్లాస్టీలు మొదలైన వివిధ వెన్నెముక పరిస్థితుల వ్యాప్తంగా సాటిలేని ప్రశస్తతను సాధించామన్నారు. అందులో కనీసమైన శరీరకోతలు ఉండటం వల్ల తక్కువ, చిన్నపాటి కోతలు, కనీస కణజాల ప్రభావం, కచ్చితత్వ మెరుగుదల, పెంపొందిత భద్రత, తక్కువ చిక్కు సమస్యలు ఉండి శీఘ్రంగా కోలుకొని తిరిగి సాధారణ జీవితం పొందుతారన్నారు. రోగులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ డాక్టర్ లోకేష్, ఎ.వీరప్ప లు వివరిస్తూ.. "రోబోటిక్ కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్స అనేది ఆర్థోపెడిక్ సంరక్షణ రంగంలో మొత్తం శస్త్రచికిత్స సంబంధిత, కోలుకునే ప్రక్రియను సంపూర్ణంగా విప్లవాత్మకం చేసిందన్నారు. ఇది కనీసంగా కోత, పెరిగిన ప్రశస్తత, కనీసంగా ఎముక కోతలు, శస్త్రచికిత్స అనంతర నొప్పి తక్కువ ఉండటం, వేగవంతంగా కోలుకోవడం, శస్త్రచికిత్స ప్రక్రియను వేగంగా ట్రాక్ చేయడం త్వరగా కోలుకోవడానికి దారి తీస్తూ సాధారణ జీవితానికి తిరిగి రావడం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జూమ్ కాన్ఫరెన్స్‌లో ఫ్యామిటీ వెల్ఫేర్ కమిషన్ సమీక్ష

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సీజనల్ వ్యాదులైన కలుషిత నీటి ద్వారా వచ్చే డయేరియా అతిసార రాకుండా ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వాటర్ టెస్టింగ్ సిహెచ్‌వోల ద్వారా ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి గురువారం తప్పనిసరిగా సర్వే చేసిన పాపులేషన్‌కి టీకాలు వేసి ఆప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలతో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి మరణాలు సంభవించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సదుం ఎంపీపీ మృతి


యల్లప్ప భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

ప్రజాశక్తి-సదుం: సదుం ఎంపీపీ బొజ్జా యల్లప్ప(72) శుక్రవారం ఉదయం సుమారుగా 3గంటల ప్రాంతంలో గుండె పోటుతో సదుం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. ఎంపిపి యల్లప్ప బంధువుల సమాచారం మేరకు.. గురువారం రాత్రి సుమారుగా 2గంటల సమయంలో ఆయనకు ఛాతి నొప్పి రావడంతో అతని కుటుంబ సభ్యులు సదుం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. హఠాత్తుగా ఆయనకు గుండె నొప్పి రావడంతో శుక్రవారం ఉదయం సుమారుగా 3గంటలకు ఆయన మరణించినట్లు తెలిపారు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు, తమ్ముడు, చెల్లెలు వున్నారు. ఈయన పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగా, అభిమాన పాత్రుడుగా, విధేయత కలిగిన వ్యక్తిగా అందరికీ సుపరిచితులు. ఉన్న పలంగా అతని మరణ వార్త విన్న అతని బంధు మిత్రులు, పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు, వైసీపీ నాయుకులు, కార్యకర్తలు, అభిమానులు కంట తడిపెట్టారు. దళిత సామాజిక వర్గానికి చెందిన బొజ్జా యల్లప్ప తిరుపతి తపాల శాఖలో పోస్ట్ మాస్టర్‌గా సేవలు అందించారు. తపాల శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తపాల శాఖ తరుపున యూనియన్‌లలో పలు హోదాలో సేవలు అందించారు. తిరుపతి అంబేద్కర్ కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సొసైటీలో పలు హోదాలలో సేవలు అందించారు. ఆయన మరణం పట్ల పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు, వైసీపీ నాయుకులు, కార్యకర్తలు, అభిమానులు దళిత సంఘాల నాయుకులు, డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద ఎత్తున ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈయన భౌతికాయాన్ని ప్రజల సందర్శనార్థం ఆయన స్వగ్రహం చిచ్చిలివారిపల్లిలో ఉంచారు. ఈయన భౌతిక కాయానికి శనివారం దహన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన పార్థీవ భౌతిక కాయానికి చిత్తూరు మాజీ ఎంపి రెడ్డెప్ప, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, పెద్దిరెడ్డి ఇందిరమ్మ, జెడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, వినాయక కళాశాలల చైర్మన్ రమణా రెడ్డి, సుగుణమ్మ దంపతులు, దళిత సంఘాల నాయుకులు వెంకటస్వామి, మల్లేపల్లి శ్రీనివాసులు, సీతాపతి, రామచంద్రయ్య, శ్రీరాములు, పలువురు ఆయనకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రభుత్వ బడులు పరిరక్షించుకుందాం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షిణ మనందరి బాధ్యత అని జెడ్పీ ఉన్నత పాఠశాల కాణిపాకం ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌నాయుడు పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడిని రక్షించుకుందాం, పాఠశాలలో విద్యార్థులను చేర్పిదం అనే కరపత్రాన్ని పాఠశాల ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో నైతిక విలువలు, సంస్కారం, విలువలతో కూడిన విద్యను అందిస్తోందని ప్రభుత్వం విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, సురేంద్రబాబు, శాంతాదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం.. నేతల సంబరాలు


వికోట: సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: రెండు దశాబ్దాల తరువాత జీడీ నెల్లూరులో టీడీపీ జెండా ఎగరడం, శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్ ప్రమాణస్వీకారం చేస్తుండడంతో నేతలు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని కొత్తపల్లి మిట్ట వద్ద టీడీపీ నాయకులు సూరి రెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై బాణాసంచాలు పేల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో యోగేశ్వర్ నాయుడు, భాస్కర్, నవీన్ రెడ్డి, సాయి, జ్యోతీశ్వరన్, అజిత్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.


వికోట: టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం ముఖ్యమంత్రిగా శాసనసభలో అడుగుపెట్టిన సందర్భాన్ని పరిష్కరించుకొని స్థానిక నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. 2021లో గత ప్రభుత్వంలో ప్రతిపక్ష నేత చంద్రబాబును శాసనసభలో అగౌరపర్చడంతో అది కౌరవ సభ లాంటిదని ఇటువంటి సభలో తాను ఉండలేనట్టు మరల సభలో ముఖ్యమంత్రిగా అడుగుపెడతానన్న శవదాన్ని సహకారం చేసేందుకు సహకరించిన ప్రజలకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్ ఆధ్వర్యంలో జనసేన, బిజెపి పార్టీల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం భారీగా బానసంచా పేల్చి కేకులు కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నేతలు చౌడప్ప, రాంబాబు, నాగభూషణం, సుబ్బన్న, శబరిష్, మురుగేష్, పొట్టు భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమల: సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి శుక్రవారం అసెంబ్లీ భవనంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి టిడిపి శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో చంద్రబాబు అవమానకర పరిస్థితిని చేపట్టి ఆయనను కించపరచడంతో ఆనాడు శపథం చేసి తిరిగి సీఎంగా బాధ్యతలు చేపట్టి అసెంబ్లీలోకి అడుగు పెడతానని చెప్పడంతో ఆ శఫదాన్ని నెరవేర్చి నేడు అసెంబ్లీలో అడుగుపెట్టిన సందర్భంగా సంబరాలు చేసుకుంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, రంగయ్య శెట్టి, నరసింహ యాదవ్, రెడ్డప్ప నాయుడు, వెంకటరామయ్య, గిరి రాయల్, త్యాగ, రఫీ పాల్గొన్నారు.


సోమలలో

చెత్త తొలగించారు..

ప్రజాశక్తి వార్తకు స్పందన



చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పంచాయతీ వీధుల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి కనిపించింది. శుక్రవారం ప్రజాశక్తిలో 'పేరుకుపోయిన చెత్త' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన అధికారులు సిబ్బందిని పురమాయించి అక్కడి చెత్తను తొలగించారు. దీంతో స్థానికులు ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి అని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం అన్నారు. శుక్రవారం నగరి మండల ప్రాథమిక పాఠశాల కాకవేడులో వారు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. 1,2 తరగతుల పిల్లలకు పలకలు, బ్యాగులు, పుస్తకాలు అందించారు. పాఠశాలలో చిత్రలేఖం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

భోజనం ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: చిత్తూరు జిల్లా నగరి మున్సిపాలిటీ, నగరి టిఆర్ కండిగ ప్రాథమిక పాఠశాలలోని 45మంది విద్యార్థులకు భోజనం చేయడానికి అవసరమైన స్టీల్ ప్లేట్లను వితరణగా ఆయన పాఠశాల ఉపాధ్యాయిని సుజాత అందజేశారు. అదే పాఠశాలలో విద్యను బోధించు ఉపాధ్యాయురాలు సుజాత పిల్లలకు భోజనం చేయుటకు ప్లేట్లు లేనందున తన సొంత నిధులు వెచ్చించి దాతృత్వముతో స్కూల్ లోనీ పిల్లలు అందరికీ ప్లేట్లు పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి-2 నమశ్శివాయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సేవను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు జ్యోతి నాయుడు, గుణశేఖర్, కేశవులు, రమేష్ బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి టీవీ వితరణ



టీవీ వితరణ చేస్తున్న దాత గణేష్

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి అదే గ్రామానికి చెందిన దాసరి గణేష్ తన కుమార్తె చరణ్యశ్రీ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రూ.20వేలు విలువజేసే కలర్ టీవీని సీడీపీవో పద్మసునందకు అందించారు. ఈ సందర్భంగా దాత గణేష్ మాట్లాడుతూ చిన్నారులకు సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతో టీవీ వితరణ చేయడం జరిగిందన్నారు. అనంతరం సీడీపీవో పద్మసునంద మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. అలాగే రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆంగన్వాడీ పర్యవేక్షకుల శామిని, వనజ, మంజుల, దామోధరం, చిన్నకుప్పారెడ్డి, బాబు, ఆచారి సుబ్రమణ్యం, భాస్కర్, బాబు, చంద్ర పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-రామకుప్పం: అన్నపూర్ణానంబ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకం, వివిధ పుష్పాలతో విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో శివనామస్మరణలతో ఆలయం మార్మోగింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.

నాణ్యమైన విద్యకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-రామకుప్పం: నాణ్యమైన విద్య బోధనకు ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి రాష్ట్ర నేత మునస్వామి, మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల శివార్లలోని మోడల్ స్కూల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల కంటే మెరుగైన విద్యా బోధనలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అలాగే మండలంలో అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామన్నారు. అమ్మకు వందనం ద్వారా ఏటా రూ.15వేలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నరసింహులు, రామ్మూర్తి, చిన్న కృష్ణ, సుబ్రి, రఫీ, ఆనందప్ప, పెరుమాళ్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న నాయకులు

డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన



డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-శాంతిపురం: డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని జిల్లా ఏపీఎంఐపి బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని రైతులు చేపడుతున్న బిందు సేద్యంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గడ్డురు గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు రెడ్డి పొలంలో అమర్చిన బిందు సేద్యం పరికరాలను రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆమ్లా చికిత్స ద్వారా పూడినట్టి డ్రిప్పర్లను ఎలా బాగు చేయాలో తెలిపారు. డ్రిప్ పరికరాలు వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా రైతులు రాయితీపై డ్రిప్పు పరికరాలు కావాలని ఆయన్ను కోరారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తే మళ్లీ సబ్సిడీ ద్వారా డ్రిప్పులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఐఏవో సాయి శ్రీనివాస్, ఫినోలెక్స్, నాగార్జున కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ అభిమాని తిరుమలకు పాదయాత్ర



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: టీడీపీ వీరాభిమాని వినోద్‌కుమార్ తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. శుక్రవారం ఎస్ఆర్ పురం నుంచి మాలదారణలో పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఘన విజయం సాధిస్తే తిరుమలకు పాదయాత్రగా వస్తానని శ్రీవారిని మొక్కుకున్నట్లు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం శాసన సభ్యులు ప్రమాణస్వీకారం చేయడం శుభపరిణామం అన్నారు. టీడీపీ విజయం సాధించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- సీనియర్ సివిల్ కోర్టు జడ్జ్ శ్రీనివాసరావు



ప్రజాశక్తి-పలమనేరు: పట్టణ పరిధిలోని సీనియర్ సివిల్ కోర్ట్, జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 29న నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆ మేరకు లోక్ అదాలత్‌ను కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు కలసి విజయవంతం చేసేందుకు తోడ్పడాలన్నారు. శుక్రవారం సబ్ కోర్టులో పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జిలు పగడాల శ్రీనివాసరావు, లిఖితలు మాట్లాడుతూ.. ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పలు కేసులను, న్యాయవాదులు, పోలీసులు సమన్వయంతో కలిసి కేసుల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ విష్ణు రఘువీర్; సీఐలు చంద్రశేఖర్, చిన్న గోవిందు, ఎస్ఐలు సహదేవి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో ముగిసిన జ్యేష్టాభిషేకం



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన జ్యేష్టాభిషేకం శుక్రవారం ఘనంగా ముగిసింది. చివరిరోజు ఉభయదేవేరులతో కలిసి శ్రీమలయప్ప స్వామివారు బంగారు కవచంలో పునర్దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్టాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతో ఉంటారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఉభయనాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. శ్రీమలయప్ప స్వామివారికి, దేవేరులకు శతకలశ తిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, జేఈవో వీరబ్రహ్మం పాల్గొన్నారు.

వైసిపి ఆక్రమిత భూముల్లో షాపులు తొలగించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వైసిపి హయాంలో ప్రభుత్వ భూములు కబ్జా చేసి, నగరంలో అక్రమంగా షాపులు నిర్మించి వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం తిరుపతి అర్బన్ ఎస్పి కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌కు, టిటిడి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సుగుణమ్మ మాట్లాడుతూ తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్, శ్రీనివాసం, విష్ణునివాసం, గోవిందరాజుల స్వామి గుడి, కోనేరు చుట్టుపక్కల ప్రాంతాల్లో 2019 నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని భక్తులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాత్రిపూట మద్యం సేవిస్తూ, దందాలు సెటిల్మెంట్లు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. అనధికారిక షాపులను ఖాళీ చేయించి, భక్తులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు చినబాబు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టండి

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలంలోని అత్తూరు పంచాయతీలో, రేణిగుంట పట్టణంలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలన పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి పిల్లలను అంగన్వాడి సెంటర్లకు చేర్పించాలని, ప్రీస్కూల్ ,ఆటపాటలతో మంచి పౌష్టిక ఆహారం ఇవ్వడం జరుగుతుందని, అలాగే 11 సంవత్సరాలు పైబడిన ఆడపిల్లలకు అత్తూర్ లోని బాలికల ఉన్నత పాఠశాలలో హైస్కూల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎంఎస్కే ధనమ్మ పాల్గొన్నారు.

ఐఐటీలో ప్రారంభమైన కేంద్రీయ విద్యాలయం

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటి) లో కేంద్రీయ విద్యాలయం ఒకటి నుండి 5వ తరగతి వరకు చదువుకునే పేద విద్యార్థులకు ఒక్కో సెక్షన్‌కి 32 మంది పిల్లల చొప్పున డైరెక్టర్ అండ్ చైర్మన్ ప్రొఫెసర్ కే ఎన్ సత్యనారాయణ వేడుకగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సమిత్ బిశ్వాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. కనగశేఖరన్, డిప్యూటీ రిజిస్ట్రార్ అండ్ ల్యైషన్ ఆఫీసర్ చామన్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జేఏసీలో సిఆర్ఎంటి మునికృష్ణయ్యకి ప్రాతినిధ్యం


ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఏపీ సమగ్ర శిక్షణ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఎన్నికలు ఏవి నాగేశ్వరావు అధ్యక్షతన విజయవాడలో రెండు రోజుల క్రితం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తిరుపతి జిల్లాకు ప్రాతినిధ్యం కల్పిస్తూ పుత్తూరు మండలంలో సిఆర్ఎంటిగా పనిచేస్తున్న ఇ మునికృష్ణయ్యకి రాష్ట్ర జేఏసీ వైస్ ప్రసిడెంటుగా, శ్రీ కాళహస్తి మండలం ఏంఐఎస్‌గా పని చేస్తున్న కె మాధవయ్యకి రాష్ట్ర జేఏసీ జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షా వ్యవస్థలో పని చేసే అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా మని తెలిపారు. తనను ఎన్నుకొన్నందుకు అన్ని విభాగాల ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

సెవెన్ హిల్స్ ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -రామచంద్రాపురం: విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేపట్టాలని జేఎన్టీయూ ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి రమణారెడ్డి అన్నారు. వెంకట్రామాపురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ పి రమణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు పొందేందుకు కృషి చేయాలన్నారు. కళాశాలలు ఉత్తమ ప్రతిభ కన బరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనం తరం128 మంది బి ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు, కరస్పాండెంట్ సుమలత, శరవణ కుమార్, విద్యార్థిని విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఆగిన 14 వెంకటగిరి డిపో బస్సు సర్వీసులు



ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: వెంకటగిరి నుండి 14 బస్సు సర్వీస్‌లను నిలిపివేసినట్లు బస్టాండ్ కంట్రోల్ పాయింట్ వద్ద నోటీస్ బోర్డును ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. నిత్యం తిరుపతి, గూడూరు, నెల్లూరు, కాళహస్తికి ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు అనారోగ్య కారణాల వల్ల వైద్య సేవలకు వెళ్లే రోగులకు ఆర్టీసీ షాక్ ఇచ్చింది. వెంకటగిరి తిరుపతి, వెంకటగిరి నెల్లూరు, వెంకటగిరి కాళహస్తి, వెంకటగిరి గూడూరు మధ్య తిరిగే సర్వీస్ బస్సులు లేని కారణంగా, ప్రవేట్ బస్సుల యజమానుల కాలపరిమితి పూర్తయిన కారణంగా నిలిపేసినట్లు తెలిపారు. ఉదయం 5 గంటల నుండి ప్రయాణికులు బస్సులు సక్రమంగా లేక ఇబ్బంది పడ్డారు. ప్రజా రవాణా దష్వ్యా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు బస్ సౌకర్యాలను కల్పించాలని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. అయితే ప్రస్తుతం ఉన్న సర్వీసుల్ని నిలుపుదల చేసి ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎలా నిర్వహిస్తారో అంటూ ప్రయాణికులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రయాణికుల సమస్యలను గుర్తించి వెంకటగిరి డిపో లో ఆగిన 14 బస్ సర్వీసులను పునరుద్ధరణ చేయాలని కోరుతున్నారు.

రెండు దశాబ్దాల సారం 'తులసి' గాత్రం



ప్రజాశక్తి - తిరుపతి సిటి తిరుపతి కళాకారిణి ఆర్.తులసిబాయ్ ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనల గాత్ర కచేరి అందరినీ ఆకట్టుకుంది. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో వారం రోజులుగా సప్తగిరి సంగీత సప్తాహం ఏడు రోజుల నిర్విరామ సంగీత ఉత్సవాల్లో భాగంగా తులసిబాయ్ గానం ఆకర్షించింది. సప్తాహం నిర్వాహకులు పున్నమరాజు మురళీకృష్ణ వాయించిన డోలు ఆకట్టుకుంది.

అంకితభావంతో సేవలందించాలి

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ కి ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళుతున్న ప్రవీణ్‌కుమార్‌ను సహచర ఉద్యోగులు, అధికారులు వీడ్కోలు పలుకుతూ అభినందనలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రవీణ్‌కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఏ విధమైన విధివిధానాలు అవలంబించామనేది డాక్యుమెంటేషన్ చేయడం, రాబోయే ఎన్నికల నిర్వహణకు దిక్సూచిగా ఉపయోగపడుతుందన్నారు. తాను కలెక్టర్‌గా మూడుసార్లు పనిచేసి, నాలుగోసారి కలెక్టర్‌గా ఇసిఐ ఆదేశాల నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ బాధ్యతను ఛాలెంజిగా తీసుకున్నట్లు చెప్పారు. నీతి నిజాయతీగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు వెన్నుదన్నుగా ఉంటానన్నారు. జెసి ధ్యానచంద్ర, డిఆర్ఒ పాల్గొన్నారు.

నాణ్యమైన నెయ్యితో శ్రీవారి లడ్డూలు చేయండి : ఈవో



ప్రజాశక్తి - తిరుమల: నాణ్యమైన నెయ్యి, శెనగపిండి, యాలకులు ఉపయోగించి మరింత రుచికరంగా లడ్డూల శాంపిల్స్ తయారు చేసి నాణ్యతను పరిశీలించాలని టీటీడీ ఈవో జె శ్యామలరావు పోటు కార్మికులను ఆదేశించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి గృహంలో శుక్రవారం లడ్డూ తయారీపై జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్‌వో నరసింహకిషోర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. లడ్డూ తయారీలో ఉన్న సమస్యలు, నాణ్యతా లోపం పై వస్తున్న విమర్శలకు గల కారణాలను ఈవో పోటు కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోటు కార్మికులు లడ్డూల తయారీలో వినియోగిస్తున్న శెనగపిండి, నెయ్యి, యాలకుల నాణ్యతను పెంపొందించాలని అభిప్రాయ పడ్డారు. అంతే కాకుండా పని భారం పెరిగిపోవడంతో అదనపు సిబ్బందిని తదనుగుణంగా నియమించాలని వారు ఈఓకు విన్నవించారు. అన్ని ముడి సరుకులను టెండర్ల ద్వారా సేకరిస్తున్నామని, తక్కువ ధరకు తెలిపిన వారి వద్దనుండి కొనుగోలు చేస్తామని సంబంధిత అధికారులు ఈఓకు వివరించారు. అధికారులు, పోటు కార్మికుల సలహాలు, సూచనలు విన్న తరువాత, ఈవో మాట్లాడుతూ అత్యంత నాణ్యమైన నెయ్యి, ఇతర పదార్థాలను ఉపయోగించి రుచికరమైన లడ్డూల నమూనాలను (శాంపిల్స్)తయారు చేసి రుచి, నాణ్యతను పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఏఈవో (పోటు) శ్రీనివాసులు, విశ్రాంత ఏఈవోలు శ్రీనివాసన్, వసంతరావు పాల్గొన్నారు.

ప్రాంతీయ వ్యవసాయశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులుగా వి.సుమతి

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయశోధనస్థానం సహ పరిశోధనా సంచాలకులుగా డా.ఉప్పుచెర్ల సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డా.సి.రమణ ప్రధాన శాస్త్రవేత్తగా బదిలీ అయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దక్షిణ మండలం పరిధిలోని చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, వై.ఎస్.ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని పరిశోధనా స్థానాలు, కషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల ద్వార రైతులకు అవసరమైన నూతన సాంకేతిక విజ్ఞానాన్ని పరిశోధించి వారికి చేరువయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా డా.సుమతి తెలిపారు.

శ్రీసిటీని సందర్శించిన సిఐఐ బృందం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: ఆంధ్రప్రదేశ్ విజయవాడ జోన్ కు చెందిన 16 మంది భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) సభ్యుల బందం రెండు రోజులు (గురువారం, శుక్రవారం) శ్రీసిటీని సందర్శించి, ఇక్కడ తయారీ పరిశ్రమలలోని సాంకేతిక నైపుణ్యాలను అధ్యయనం చేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలతో పాటు 'మేక్ ఇన్ ఇండియా' చొరవతో శ్రీసిటీ దేశంలోని ప్రధాన పారిశ్రామిక పార్కులలో ఒకటిగా ఎలా మారిందో వివరించారు.

ఈ బందానికి సీఐఐ విజయవాడ జోన్ ఛైర్మన్ డివి రవీంద్రనాథ్, వైస్ చైర్మన్ డాక్టర్ వి.నాగలక్ష్మి నాయకత్వం వహించారు.

దళితునిపై దాడి దారుణం : కెవిపిఎస్



ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరుకు పొట్ట చేత పట్టుకొని కూలీ పనికి వచ్చిన దళిత కులానికి చెందిన బల్లవోలు నారాయణపై దాడి చేసిన ఎస్కే కాలేషా పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బల్లవోలుకు చెందిన నారాయణ శుక్రవారం గూడూరు రెండో పట్టణంలోని చింపిరి నాయుడు కాల్వ వద్ద ఓ ఇంటికి దారి తలుపు బిగించేందుకు పనికి వెళ్లాడు. అక్కడ సవక నరుకుతుండగా అదే ప్రాంతానికి చెందిన కాలేషా ఇక్కడ ఏమి చేస్తున్నావ్ అంటూ దాడికి పాల్పడ్డాడు. తాను తమ యజమాని తలుపు బిగించేందుకు సవక నరుకుతున్నానని చెప్పినా వినకుండా కులం పేరుతో దూషించాడు. అక్కడే ఉన్న గడ్డపారతో పొడిచేందుకు ప్రయత్నించగా యజమాని వచ్చి కాపాడారు. 100కి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఈ విషయమై శుక్రవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో గూడూరు డివిజన్ కె.వి.పి.ఎస్ నాయకులు అడపాల ప్రసాద్, జోగి శివకుమార్ కె.శ్రీనివాసులు బాధితునితో కలిసి ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-పుంగనూరు: మంగతాయి(పేకాట) ఆడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఈడిగిపల్లికి సమీపంలో 2కిమీ దూరంలో మంగతాయి (లోపల బయట పేకాట) ఆడుతుండగా దాడులు నిర్వహించామ న్నారు. ఈ దాడులలో స్వామినాథన్, ఈశ్వర య్య, ఆదినారాయణ అనే ముగ్గురిని అదుపు లోకి తీసుకున్నట్లు వివరించారు. వారి వద్ద నుంచి రూ.15790లు నగదును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బామ్మర్ది, మామపై అల్లుడి దాడి

ప్రజాశక్తి-పుంగనూరు: దంపతులిద్దరి మధ్య గొడవలు జరుగుతుండడంతో సర్ది చెప్పుదామని బిడ్డనిచ్చిన వారు వెళ్లగా ఆవేశపడిన అల్లుడు మామ, బామ్మర్దిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన పుంగనూరు మున్సిపాలిటీ పరిధి మంగళం కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. సాధిక, ఇంతియాజ్ ఇరువురు భార్య భర్తలు. మంగళం కాలనీలో కాపురం ఉంటున్నారు. సాధికా తండ్రి, అన్న కూడా అదే కాలనీలో నివాసం ఉన్నారు. సాధికా కుటుంబంలో అప్పుడప్పుడూ గొడవలు పడుతుండేవారు. అదేవిధంగా గురువారం రాత్రి కూడా గొడవ పడుతుంటే సాధికా తండ్రి నజీర్ బాషా, అన్న అహమ్మద్ అలీ వారికి సర్ది చెప్పడానికి వెళ్ళారు. అయితే తమ కుటుంబంలో మీ జోక్యం ఏమంటూ అల్లుడు వారిద్దరిపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో నజీర్ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆలయంలో చోరీ



ఆలయంలో దుండగులు పగలగొట్టిన హుండీ, బీరువా

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్కంధపుష్కరిణీ సమీపంలోని కుమారగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యంస్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు సుబ్రమణ్యస్వామి ఆలయంలోనికి చొరబడి హుండీని పగల గొట్టి అందులోని నగదును దోచుకున్నట్లు గుర్తించారు. అలాగే బీరువాను పగల గొట్టి అందులోని విలువైన వస్తువులకు కూడా తీసుకెళ్లినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు స్థానికులు తెలుసుకున్నారు. అదే విధంగా మోటారు, సీసీ కెమెరాకు సంబంధించిన సీపీయూ బ్యాక్సును అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకట కృష్ణ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం చిత్తూరుకు చెందిన వేలిముద్ర నిపుణులతో వేలిముద్రలు సేకరించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్-కారు ఢీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: బైక్-కారు ఢీకొన్న సంఘటన శుక్రవారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట కూడలి వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కావనూరు గ్రామానికి చెందిన మునిక్రిష్ణ, ప్రేమ్‌కుమార్ కార్వేటినగరం మీదుగా పళ్లిపట్టు వైపు వెళుతూ ముందు వెళుతున్న వాహనాన్ని ఒవర్‌టేక్ చేయబోయి చిత్తూరు నుంచి కార్వేటినగరం వైపుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ద్విచక్రవాహనంలో వెళుతున్న మునికృష్ణ, ప్రేమ్‌కుమార్‌లకు గాయాలయ్యింది. అదే విధంగా ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి కారు రోడ్డుకు సమీపంలో ఉన్న ఊచిక బోర్డును ఢీకొనడంతో కారు అద్దాలు నుజ్జు నుజ్జు అయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ద్విచక్రవాహన దారులను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి 108వాహనం ద్వారా తరలించారు.

ఆటోని ఢీకొన్న బస్సు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కూలీలతో వెళుతున్న ఆటోను వోల్వో బస్సు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం బైరెడ్డిపల్లి మండలం పలమనేరు-బెంగళూరు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. బేలుపల్లి పంచాయతీ బెల్లమడుగు గ్రామానికి చెందిన పలువురు కూలీలు గంగవరం మండలం కీలపట్ల సమీపంలో మామిడి కాయలు కోసేందుకు వెళ్లి ఓ ఆటో తిరుగు ప్రయాణమైయ్యారు. పలమనేరు-బెంగళూరు జాతీయ రహదారిలోని నాగమంగళం మసీదు వద్దకు ఆటో చేరుకొనే సరికి బెంగళూరు వైపు వెళుతున్న వోల్వో బస్సు వెనుక నుంచి ఆటోను ఢీకొంది. దీంతో ఆటో అదుపుతప్పి ముందు వెళుతున్న టాటా ఏసీ వాహనాన్ని ఢీకొంది. ఘటనలో ఆటో డ్రైవర్ సుబ్రమణ్యంకు తీవ్ర గాయాలు కాగా ఆటోలో వెళుతున్న వారికి బలమైన గాయాలైయ్యాయి. వారిని స్థానికులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాగి వాహనం నడిపిన 15మందికి జరిమానా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగరంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు గురువారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తప్పతాగి వాహనం నడిపిన 15మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని శుక్రవారం చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. ఆ వాహనదారులకు జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి రూ.పది వేల చొప్పున రూ.1.50లక్షల జరిమానా విధించారు.